క్లుప్తంగా

మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడిన విద్యార్థి డిబార్

కురుపాం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పరీక్షల్లో మాల్ ప్రాక్టీస్(చూసిరాత)కు పాల్పడిన ఓ విద్యార్థిని అధికారులు డిబార్ చేశారు. సోమవారం జరిగిన సివిక్స్ పరీక్షలో కురుపాం కళాశాలకు చెందిన విద్యార్థి చూసిరాతకు పాల్పడడంతో అతడిని డిబార్ చేసినట్లు పరీక్షల నిర్వహణ చీఫ్ సూరింటెండెంట్, కళాశాల ప్రిన్సిపాల్ హరికృష్ణ తెలిపారు.

24న పంచాయతీ షాపుల వేలంపాట

వీరఘట్టం: స్థానిక మేజరు పంచాయతీ పరిధిలోని పంచాయతీ షాపులకు సంబంధించి, ఈ నెల 24వ తేదీన బహిరంగ వేలంపాట నిర్వహిస్తున్నామని ఈఓ రామచంద్రరావు ఓ ప్రకటనలో సోమవారం వెల్లడించారు. బస్సు, కారు స్టాండ్‌లతో పాటు పాతబస్టాండ్‌లోని ఆరు షాపులు, తొమ్మిదో నంబర్ ప్లాట్, పదో నంబర్ ప్లాట్, పంచాయతీ కార్యాలయం ఎదురుగా ఉన్న మరో ఎనిమిది షాపులకు వేలంపాట నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వేలంపాటలో పాల్గొనే వారు అదేరోజు ఉదయం 11 గంటలకు రావాలని, మధ్యాహ్నం 2 గంటలకు టెండర్లు తెరవబడునని వెల్లడించారు.

హౌసింగ్ ఏఈఈ బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరించిన ప్రభాకరరావు

భామిని: మండల హౌసింగ్ ఏఈఈగా ఎల్.ప్రభాకరరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. బలిజిపేట నుంచి బదిలీ వచ్చిన ఈయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ప్రజలు, సిబ్బంది తనకు సహకరించాలని కోరారు. నిర్మాణంలోని పీఎంఏవై గృహాలను పరిశీలించి, బిల్లులు పెడతామన్నారు.

600 పశువులకు టీకాలు


వంతరాంలో పశువులకు టీకాలు వేస్తున్న సిబ్బంది

బలిజిపేట: మండలంలోని వంతరాంలో 600పశువులకు గాలికుంటువ్యాధి టీకాలు వేసినట్లు మండల పశువైద్యశాఖ అధికారి గణేష్ సోమవారం తెలిపారు. పశువులకు గాలికుంటు వ్యాధి లక్షణాలు సోకే అవకాశాలు ఉన్నందున ముందస్తుగా టీకాలు వేసే కార్యక్రమాన్ని ప్రభుత్వ ఆదేశాల మేర చేపట్టినట్లు ఆయన తెలిపారు. నోటివెంట చొంగకారడం, నాలికపై బొబ్బర్లు, అధిక జ్వరం, మేత తీసుకోకపోవడం, పాల ఉత్పత్తి తగ్గిపోవడం, కాలి గిత్తల మధ్య పుళ్లు వంటి వ్యాధి లక్షణాల నివారణకు ముందస్తుగా టీకాలు వేస్తున్నట్లు సిబ్బంది రైతులకు ఈ సందర్భంగా తెలియజేశారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నూకలవాడలో ఫ్యామిలీ డాక్టర్ సేవలు


మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్న అధికారులు

బలిజిపేట: మండలంలోని నూకలవాడ గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ సేవలను బలిజిపేట వైద్యశాఖ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. వైద్యాధికారిణి క్రాంతి కిరణ్మయి ఈ సందర్భంగా 68మంది రోగులకు వైద్యసేవలు అందించారు. డయాబెటిక్, బీపీ వంటి దీర్ఘకాలిక వ్యాధులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. వేసవికాలం దృష్ట్యా ప్రజలు గొడుగులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు వినియోగించాలని సూచించారు. గ్రామంలో ఉన్న పాఠశాల విద్యార్థులకు దంత సంరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ ఎస్వీ రమణ, 108 సిబ్బంది ప్రసాద్, లక్ష్మణ, తదితరులు పాల్గొన్నారు.

పంటల పరిశీలన

సాలూరు: అకాల వర్షాలతో నష్టపోయిన పంటలను ఏఓ అనురాధ పండా సోమవారం పరిశీలించారు. ఈ మేరకు మండలంలోని తోణాం, కురుకూటి, మరిపల్లి పంచాయతీల్లో పర్యటించి నేలరాలిన మొక్కజొన్న, అరటి తదితర పంటలను పరిశీలించారు. ఇందులో ముఖ్యంగా తోణాంలో అధికంగా మొక్కజొన్న పంట నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక నివేదికలో గుర్తించామని చెప్పారు. తోణాం, తుండ తదితర ప్రాంతాల్లో సుమారు 32 ఎకరాల్లోని ఉద్యానవన పంటలు నష్టపోయినట్లు గుర్తించామని మండల హార్టికల్చర్ అధికారిణి ప్రత్యూష తెలిపారు. నష్టనివేదికను ప్రభుత్వానికి పంపిస్తామన్నారు.

సమస్యల పరిష్కారానికి

‘జగనన్నకు చెబుదాం’


సీతంపేట: వినతులు పరిశీలిస్తున్న ఐటీడీఏ ఏపీఓ రోసిరెడ్డి

- సీతంపేట, పాలకొండలో మండల స్థాయి జగనన్నకు చెబుదాం కార్యక్రమం
- సమస్యల పరిష్కారానికి వినతులు సమర్పించిన ప్రజలు

సీతంపేట: మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో మండల స్థాయి జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐటీడీఏ ఏపీఓ వై.రోసిరెడ్డి పలువురి వినతులు స్వీకరించి, పరిశీలించారు. అనంతరం వారి సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. మండలంలోని పెద్దూరు పంచాయతీ, చింతమానుగూడ గ్రామంలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో బాధితుడు బాపయ్య కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని సర్పంచ్ హిమరిక ఆదిలక్ష్మి వినతిపత్రం సమర్పించగా, చింతలగూడ గ్రామంలో రెండు నెలలుగా రేషన్ పంపిణీ చేయడం లేదని సవర సిమ్మయ్య ఫిర్యాదు చేశారు. జమినివలస గ్రామానికి మినీ అంగన్‌వాడీ కేంద్రం భవనం మంజూరు చేయాలని లంబ ఎర్రంనాయుడు, బతకడానికి ఏదైనా ఉద్యోగం ఇప్పించాలని కుంబికి చెందిన అరుణ, అంబలిగండి నుంచి కుంబి వరకు రోడ్డు వేయాలని కుంబికి చెందిన రామారావు, చిన్నకింగకు మంచినీటి సదుపాయం కల్పించాలని కృష్ణారావు, టిటుకుపాయిగూడకు కమ్యూనిటీ హాల్ మంజూరు చేయాలని గ్రామస్తులు, రేగుమానుగూడకు కొత్త విద్యుత్ స్తంభాలు


పాలకొండ: వినతిపత్రం స్వీకరిస్తున్న సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్

వేయాలని గ్రామస్తుడు పెంటయ్య, కంప్యూటర్ కాటా ఇవ్వాలని ఇస్సరాయికి చెందిన ఎల్లంగు వినతిపత్రాలు సమర్పించారు.
అనంతరం అధికారులు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం ప్రతీ సోమవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహిస్తోందని, దీనిని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎడ్యుకేషన్ ఓఎస్డీ యుగంధర్, ఏఎంఓ కోటిబాబు, ఏపీడీ నారాయణరావు, ఐటీడీఏ స్పోర్ట్స్ ఇన్‌చార్జ్ జాకాబ్ దయానంద్, జీసీసీ డీఎం సంధ్యారాణి, సీడీపీఓ రంగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.
పాలకొండ: మండల కేంద్రంలో జరిగిన స్పందన కార్యక్రమంలో పలువురు సమర్పించిన వినతిపత్రాలను సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్ పరిశీలించి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. భాసూరు గ్రామం దగ్గర పారే గెడ్డ వల్ల అక్కడి మెయిన్ రోడ్డు కోతకు గురవుతున్న విషయాన్ని గ్రామస్తులు, కొంతమంది పెద్దలు సబ్‌కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. రక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. దీనికి సబ్‌కలెక్టర్ కూడా సుముఖత వ్యక్తం చేశారు.

మొక్కజొన్న పంటకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు


పంటను పరిశీలిస్తున్న ఏఓ శ్రావణ్

బలిజిపేట: రెండు రోజుల పాటు కురిసిన వర్షంతో మొక్కజొన్న పంటకు నష్టం వాటిల్లకుండా తగు జాగ్రత్తలు పాటించాలని ఏఓ శ్రావణ్ తెలిపారు. పంటనష్టం వాటిల్లిన గ్రామాలలో ఆయన సోమవారం పరిశీలించారు. 55-60రోజుల సమయంలో ఉన్న మొక్కజొన్న పొలంలో నీరు నిల్వ ఉంటే ఆనీరు బయటకు పోయే విధంగా ఏర్పాటు చేయాలని సూచించారు. వరుసలలో గొప్పు తవ్వించాలి. బూస్టర్ డోస్‌గా 50కిలోల యూరియా, 20-25కిలోల పొటాష్ కలిపి వేయాలి. వర్షాల తరువాత తెగులు సోకేఅవకాశాలు ఉన్నందున హిసెకొనాజోల్ 400ఎంఎల్ లేదా ప్రాపికొనాజోల్ 200ఎంఎల్ ఎకరాకు పిచికారీ చేయడం వల్ల ఎండు, ఆకుమచ్చతెగులును నివారించవచ్చని హితవు పలికారు. నేలకు ఒరిగిన పంటను రైతుభరోసా కేంద్రం సిబ్బంది అంచనా వేస్తారని చెప్పారు. ప్రాథమికంగా 202ఎకరాలలో పంట నష్టం జరగవచ్చని అంచనా వేసినట్లు తెలిపారు. గింజలు మొలకలు రాకుండా ఉండడానికి 5శాతం ఉప్పుద్రావణం కంకులపై పిచికారీ చేసుకోవాలని సూచించారు. పంట నష్టపరిహారం అందేలా చర్యలు చేపడతామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేలకూలిన కోళ్లఫారం షెడ్డు

జియ్యమ్మవలస: మండలంలోని బొమ్మిక గ్రామంలో గత రెండు రోజులుగా కురుస్తున్న ఈదురుగాలులతో కూడిన వర్షానికి అక్కడి కోళ్లఫారం షెడ్డు నేలకూలింది. ఆదివారం రాత్రి పెద్దఎత్తున గాలులు వీయడంతో షెడ్డు పూర్తిగా పడిపోయిందని యజమాని పారిశర్ల పవన్‌కుమార్ వాపోయాడు. ప్రభుత్వం నుంచి ఆర్థికసాయం అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

24 నుంచి శ్రీమద్రామయణ ప్రవచన కార్యక్రమం

గరుగుబిల్లి: మండలంలోని దళాయివలస గ్రామంలో ఉన్న రామమందిరం వద్ద ఈ నెల 24 నుంచి శ్రీమద్రామయణ ప్రవచన కార్యక్రమం నిర్వహిస్తామని ప్రొగ్రాం డైరెక్టర్ రాజగోపాలరావు ఓ ప్రకటనలో సోమవారం వెల్లడించారు. మనగుడి కార్యక్రమంలో భాగంగా టీటీడీ, హిందూ ధర్మ ప్రచార పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 30వ తేదీ వరకు సాగే ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొనాలని కోరారు.

సీఎం జగన్‌మోహన్ రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే జోగారావు

- నియోజక వర్గ సమస్యలపై ప్రస్తావన


సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: పార్వతీపురం నియోజకవర్గ సమస్యలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి ఎమ్మెల్యే అలజంగి జోగారావు తీసుకువెళ్లారు. ఈ మేరకు సోమవారం సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యే కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అభివృద్ధి, దీర్ఘకాలిక పెండింగ్ ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తిచేసేందుకు, అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరారు. దీనిపై సీఎం జగన్‌మోహన్ రెడ్డి సానుకూలంగా స్పందించి నియోకవర్గ అభివృద్ధికి హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే సాక్షికి తెలిపారు.

దళిత సమాజంపై దాడి

వైఎస్సార్‌సీపీ దళిత ఎమ్మెల్యే సుధాకర్‌పై అసెంబ్లీ సాక్షిగా టీడీపీ నేతలు చేసిన దాడి దళిత జాతి, దళిత సమాజంపై దాడి అని ఎమ్మెల్యే జోగారావు అన్నారు. అసెంబ్లీలో దాడి చేసి దళితులను అవమానపరిచారన్నారు. కానీ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు దాడి చేసి అగౌరవ పరిచినట్లు వారి అనుకూల మీడియా తప్పుడు ప్రచారం చేస్తోందని, దళితులను రాజకీయంగా ఆర్థికంగా ఎదగకుండా సమాధి చేయాలని చంద్రబాబు భావిస్తున్నారని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ దళిత ఎమ్మెల్యేలు అంతా టీడీపీ కుట్రలను తిప్పికొడుతూ నేడు రాష్ట్ర వ్యాప్తంగా నిరసన తెలుపుతామని చెప్పారు.

నిందితులను తక్షణమే అరెస్టు చేయాలి

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధి మెంటిపేట ఎస్సీ కాలనీకి చెందిన దేవులపల్లి వెంకటేష్ మృతికి కారణమైన వారిని తక్షణమే అరెస్టు చేయాలని దళిత సంఘాల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక మెంటిపేట కాలనీలో సోమవారం నిరవధిక ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సామాజిక న్యాయపోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి డి.గణేష్, కేఎన్‌పీఎస్ జిల్లా కన్వీనర్ నల్లబారికి గురుమూర్తి, బీఎస్పీ జిల్లా నాయకులు బి.బుద్దుడు మాట్లాడుతూ రెల్లి కులస్తుడైన వెంకటేష్ హత్యకు కారణమైన వారిని అరెస్టు చేయడంలో సీఐ, ఎస్సైలు కావాలనే జాప్యం చేస్తున్నారని ఆరోపించారు. హంతకులపై హత్యా నేరంతో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని, కేసు దర్యాప్తు వేగవంతం చేసి నిందితులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

పోలీస్టేషన్‌లో పదోతరగతి ప్రశ్నపత్రాలు


సీతానగరం: పోలీస్‌స్టేషన్‌లో ప్రశ్నపత్రాలను పరిశీలిస్తున్న ఎంఈఓ జి సూరిదేముడు.

సీతానగరం: ఏప్రిల్ 3వ తేదీ నుంచి జరగనున్న పదోతరగతి పబ్లిక్ పరీక్షల ప్రశ్నపత్రాలు పోలీస్‌స్టేషన్‌లో భద్రంగా ఉన్నాయని ఎంఈఓ జి సూరిదేముడు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆమె మాట్లాడుతూ పోలీస్టేషన్‌కు వచ్చిన ప్రశ్నపత్రాలను పరిశీలించామని చెప్పారు. ప్రశ్నపత్రాల సెట్ 1 ఆదివారం వచ్చాయని, సోమవారం సెట్ 2 ప్రశ్నపత్రాలు వచ్చాయని తెలియజేశారు. వరుసగా రెండు రోజులూ వచ్చిన ప్రశ్నపత్రాలు పదోతరగతి పబ్లిక్ పరీక్షల నిర్వాహకులు, మండలంలోని ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల పర్యవేక్షణలో పోలీస్టేషన్‌లో భద్రపర్చినట్లు తెలియజేశారు.
బలిజిపేట: పదవ తరగతి ప్రశ్నపత్రాలు బలిజిపేట పోలీస్‌స్టేషన్‌లో భద్రపరిచారు. బలిజిపేట పోలీస్టేషన్‌కు సోమవారం సెట్-2ప్రశ్నపత్రాలు వచ్చాయి. ఆదివారం సెట్-1 ప్రశ్నపత్రాలు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

● జాతర చూద్దాం రండి!


జాతర అందాలను తిలకిస్తున్న ప్రజలు


జాతర సందర్భంగా నిర్వహించిన బుర్రకథ ప్రదర్శన


డ్రాగన్ ట్రైన్‌లో జనం సందడి

ఉమా సహిత కైలాసనాథస్వామి ఆలయ వార్షికోత్సవం పురస్కరించుకుని, గుమ్మలక్ష్మీపురం మండల కేంద్రంలో జరుగుతున్న జాతర జనజాతరను తలపిస్తోంది. రాష్ట్ర నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు, యాత్రికులు, పర్యాటకులు అక్కడికి చేరుకుని, తొలుత ఆలయంలో స్వామికి పూజలు చేస్తున్నారు. రాత్రి వరకు అక్కడే ఉండి, జాతర సందడిని చూసి, ఆనందిస్తున్నారు. చిన్నాపెద్దా తేడా లేకుండా రంగులరాట్నం, జెయింట్‌వీల్, బ్రేక్ డ్యాన్స్ చైర్, డ్రాగన్ ట్రైన్ ఎక్కేందుకు ఉత్సాహం కనబరుస్తున్నారు. ప్రతిరోజూ నిర్వహించే పలు సాంస్కృతిక ప్రదర్శనలు చూపరులను అలరిస్తున్నాయి. -సాక్షి నెట్‌వర్క్

ఎస్సీ, ఎస్టీలంటే టీడీపీకి ఎందుకంత చులకనా?


సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నేత తోట సింహాచలం

భామిని: ఎస్సీ, ఎస్టీలంటే టీడీపీకి, ఆ పార్టీ అధినేత చంద్రబాబునాయుడు, నాయకులకు ఎందుకంత చులకన భావమని మండల వైఎస్సార్ సీపీ నాయకులు తోట సింహాచలం, కొవ్వాడ చిరంజీవులు, కొత్తకోట చంద్రశేఖర్, బోనగడ్డి ధర్మారావు, టింగ అన్నాజీరావు ప్రశ్నించారు. సోమవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడిన వారు అసెంబ్లీ సమావేశాల్లో డిప్యూటీ సీఎం నారాయణస్వామి, దళిత ఎమ్మెల్యే సుధాకర్‌లపై టీడీపీ ఎమ్మెల్యేలు ఇష్టానుసారంగా నోరుపారేసుకోవడాన్ని ఖండించారు. శాసనసభ సమావేశాల్లో పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి గిరిజన సమస్యలపై మాట్లాడుతున్నప్పుడు టీడీపీ సభ్యులు అడ్డుకోవడం సరికాదన్నారు. అప్పట్లో ఓసారి దళితుల్లో ఎవరైనా పుట్టాలనుకుంటారా అని చంద్రబాబు అన్నారని, అలాగే ఆయన పాలనా కాలంలో గిరిజనులు, దళితుల సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. ఇప్పుడు ఆయన బాటలోనే ఆ పార్టీ నేతలు కూడా వ్యవహరిస్తుండడం సిగ్గుచేటన్నారు. ప్రజలకు మంచి చేసే రాజకీయాలు చేయాలని, కక్ష, కుట్రపూరిత రాజకీయం చేయడం తగదన్నారు. ఇప్పటికైనా మంచిగా వ్యవహరించకపోతే ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గెల్లంకి రమేష్, మజ్జి మోహన్‌బాబు, కొత్తకోట ఆంజనేయులు, జామి ప్రభాకర్, అర్లి రాజశేఖర్, రొక్కం రమేష్, పోతల మజ్జి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వరల్డ్ ఓరల్ హెల్త్ డే


సీతంపేట: కార్యక్రమంలో ఏరియా ఆస్పత్రి వైద్య సిబ్బంది

సీతంపేట: మండల కేంద్రంలో వరల్డ్ ఓరల్ హెల్త్ డే(ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవం) కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో స్థానిక ఏరియా ఆస్పత్రి వైద్య సిబ్బంది పాల్గొని, నోటి పరిశుభ్రతకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రతిరోజూ రెండు పూటలా బ్రష్ చేయాలని, నోటితో పాటు దంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఏరియా ఆస్పత్రి సూపరిండెంట్ బి.శ్రీనివాసరావు, వైద్యాధికారి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

కురుపాం: వరల్డ్ ఓరల్ హెల్త్ డే కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో నిర్వహించిన ర్యాలీలో సామాజిక ఆరోగ్య కేంద్రం డెంటల్ అసిస్టెంట్ సర్జన్ ఆర్.సుకృత పాల్గొని, నోరు, దంతాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అతి శీతల, వేడి పానీయాలు, పదార్థాలు తినవద్దన్నారు. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం విధిగా బ్రష్ చేసుకుని, పళ్లను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు.


కురుపాం: నోటి పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

జియ్యమ్మవలస: మండలంలోని చినమేరంగి గ్రామంలో ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న సీహెచ్‌సీ సిబ్బంది నోటి దుర్వాసన, పళ్ల పాడవ్వకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కూల్ డ్రింక్స్, వేడి పదార్థాలు ఎక్కువగా తీసుకోవద్దన్నారు. రోజూ ఉదయం, సాయంత్రం బ్రష్ చేసుకుని, పళ్లను శుభ్రపరుచుకోవాలన్నారు.

అటవీహక్కుల చట్టాలపై అవగాహన


అటవీ హక్కుల చట్టాలపై అవగాహన కల్పిస్తున్న రిసోర్స్‌పర్సన్

సీతంపేట: మండలంలోని సంకిలి గ్రామంలో అటవీ హక్కుల చట్టాలపై సోమవారం అవగాహన కల్పించారు. వెలుగు అసోషియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్‌లు ఎ.నాగరాజు, చిరంజీవి మాట్లాడుతూ అడవుల సంరక్షణ, పట్టాలు, హేబిటేషన్ రైట్స్, ఫారెస్ట్ గ్రామాలను రెవెన్యూ గ్రామాలుగా మార్చుట గురించి వివరించారు. కార్యక్రమంలో పి.నాగేశ్వరరావు, ఎస్.పార్వతి, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామదేవత పండగలోపు రోడ్డు పనులు పూర్తి చేస్తాం


స్వామి థియేటర్ సమీపంలో కాలువ నిర్మాణం కోసం జేసీబీతో మట్టి తవ్వకాలు చేస్తున్న దృశ్యం

వీరఘట్టం: మండల కేంద్రంలో మే నెలలో జరిగే గ్రామదేవత పండగలోపు ఇక్కడ జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేస్తామని ఆర్‌అండ్‌బీ జేఈ జగన్‌మోహన్‌రాజు అన్నారు. దాదాపు రూ.5.50 కోట్ల వ్యయంతో ప్రధాన రోడ్డు విస్తరణ పనులు చేపడుతుండగా, అక్కడ రోడ్డుకు ఇరువైపులా జరుగుతున్న కాలువ నిర్మాణ పనులను ఆయన సోమవారం పరిశీలించారు.
సరిగ్గా మూడు నెలల క్రితం నిలిచిన రోడ్డు విస్తరణ పనులు మళ్లీ సోమవారం నుంచి ఆరంభం కాగా, ఉగాది తర్వాత పూర్తిస్థాయిలో పనులు చేపడతామని పేర్కొన్నారు. గ్రామదేవత పండగకు పెద్ద ఎత్తున భక్తులు రానున్న నేపథ్యంలో వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా రోడ్డు పనులు చేస్తామన్నారు.

నేటి నుంచి రాగిజావ పంపిణీ


అందుకున్న గ్లాసులు చూపిస్తున్న విద్యార్థులు

గరుగుబిల్లి: జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు మంగళవారం నుంచి రాగిజావ పంపిణీ చేయనున్నట్లు ఎంఈఓ ఎస్.నాగభూషణరావు తెలిపారు. సోమవారం మండలంలోని చిలకాం గ్రామ పాఠశాల విద్యార్థులకు స్టీల్ గ్లాసుల పంపిణీ చేయగా, రాగిజావ పట్టుకునేందుకు గ్లాసులు అందజేసినట్లు పేర్కొన్నారు. ప్రతీ మంగళ, గురు, శనివారాల్లో పిల్లలకు రాగిజావ అందివ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఎం.మహేష్, ఉపాధ్యాయులు కె. రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

ధర్నా


ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

పాలకొండ: తమ సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ కార్యకర్తలు డిమాండ్ చేస్తున్నారు. ఇదే విషయమై వారంతా స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం నిరసన చేపట్టారు. అనంతరం ర్యాలీగా వెళ్లి, ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు దావాల రమణారావు మాట్లాడుతూ ర్యాలీలు, నిరసనలు చేపట్టకుండా ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నంబర్-1ను రద్దు చేయాలని, అంగన్‌వాడీ కార్యకర్తల వేతనాలు పెంచాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు బి.అమరవేణి, ఎస్.హిమప్రభ, ఎ.దర్శిని, జి.శారద తదితరులు పాల్గొన్నారు.

నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న రెవెన్యూ ఉద్యోగులు

పాలకొండ: తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ రెవెన్యూ ఉద్యోగులు సోమవారం నిరసనకు దిగారు. తహసీల్దారు కార్యాలయం ఎదుట జరిగిన ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఉద్యోగుల సంఘం డివిజన్ ఉపాధ్యక్షుడు బి.బుచ్చయ్య మాట్లాడుతూ తమ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ పి.సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.